
# మహారాజ పోషకులు

"నాగార్జునుడు"



....రైలు ఆగింది...

"ఏమిటలా మీదకొచ్చి పడతావ్, కొంచెం కుడీ, ఎడమా చూసుకో నక్కర్లేదూ? వారెవరో తెలుసా" అన్నాడతను.

నాలుగు డబ్బులు ముష్టెత్తుకొందామని రైలుపెట్టిలోకి హడావిడిగా ఎక్కిన కుంటివాడు కంగారుగా పక్కకి చూశాడు...అంతవరకూ నా చేతి సంచీ ఎక్కడపెట్టనా అని స్థలం కోసం చూస్తూన్న నేనూ, నా ఎదుటికి చూశాను ... ఎదురుగుండా తలుపు దగ్గర సీటుమీద ఎలాగో ఇరికి కూర్చున్న ఓ పెద్ద విగ్రహం కళ్ళబడింది. నల్లగా వున్నాడు. నిండైన మనిషి...పొందూరు ఖద్దరుపంచ కట్టినాడు. లోపలి బనీను కనపడేలావున్న సన్నని సిల్కు లాల్చీ. వుందా లేదా అన్నంత చిన్న క్రాపు. నోట్లో కారాకిళ్ళీ. పైమీద విసినికర్ర మడతలు పెట్టిన సన్నని జరీ వుత్తరీయం...'ఎవరీ మనిషి' అనుకొంటూ, కుంటివాడిని కసిరిన వాని వైపుచూశాను. అతనిలోనూ కొన్ని ప్రత్యేకతలు కనపడ్డాయి. పొన్నకాయిలాగుండూ, విభూతి రేఖలూ, జుట్టుముడీ, సీరుకావి ధోవతి—ఇవి అతని ప్రత్యేకతలు...ముష్టివాడు బిక్కమొగం వేసుకొని యిటూ, అటూ చూస్తూ తలుపుని జార్లాబడి నుంచున్నాడు... నేనేదోవిధంగా స్థలం చేసుకొని 'పెద్దమనిషి'కి ఎదురుగుండా వున్న సీటులో కూర్చున్నాను...పొన్నకాయ నిలబడే వున్నాడు ... ఇంతలో వుత్తరీయం సవరించుకొన్నాడు కాబోలు, ఆపెద్దమనిషి చేతి నాలుగు వేళ్ళనీ వున్న వుంగరాలు తళుక్కుమని నా కళ్ళ యెదుట యింద్రధనస్సును కల్పించాయి ... ఆ సవరించుకోడంలో చేతినున్న రిస్టువాచీ, అంతా ఖరీదయిన రాళ్లు పొదగబడివున్న వాచీగొలుసు నా కళ్లని మిరిమిట్లుగొల్పినవి ... నేనలా విస్తుపోయి చూస్తూండగా హఠాత్తుగా రైలు ఆగడం, నా ఎదురుగుండా నుంచున్న పొన్నకాయి తూలి నా ఒళ్ళోపడ్డం ఒక్కసారే జరిగింది ... కొంచెం జరిగి నాపక్కని పొన్నకాయికి స్థలం చూపించాను, ఈ పెద్దమనిషి ఎవరో కనుక్కోవచ్చు గదా అని ... పొన్నకాయి సావధానంగా కూర్చొని కొంచెం పొడుంపీల్చి ఆచెయ్యి నామీద దులిపినాడు. గాలివిసురికి పొడుం కాస్త నా కంట్లో వచ్చిపడింది ... 'అబ్బా' అన్నాను. 'పడిందా ఏమిటండీ' అన్నాడు పొన్నకాయ నిశ్చలంగా ... 'అబ్బే, లేదులెండి' అన్నాను మర్యాదగా.

'లేకపోడమేమిటి, నీళ్ళిప్పిస్తాంటే' అన్నాడు.

'అబ్బే, బొగ్గు నలుసు' అన్నాను, సత్యాన్ని చెప్పలేకుండా నన్ను చేసిన, మర్యాదని లోపల నిందించుకొంటూ.

అదే, నేనూ అంటూన్నా...కొత్త...గుడ్డని నోటి ఆవిరి పట్టి......' పొన్నకాయి ఇంకా వాక్యాన్ని పూర్తిచెయ్యక పూర్వమే, 'అలాగే లెండి' అన్నాను చిరాకుగా...ఇదంతా ఎదురుగుండాఉన్న బిచ్చగాడు చూస్తూనేఉన్నాడు... ఎదుటి సీటుమీద కూర్చున్న పెద్దమనిషి మాత్రం చూసీ చూడనట్టు ఊరుకొని, కిందపెట్టిన కాళ్ళను సీటుమీదపెట్టుకొని, బుద్ధవిగ్రహంలా, కాళ్లు మడిచి కూర్చున్నాడు...నాకు ఒళ్లు మండింది... ఉత్సవిగ్రహంలా, మాటామంతీ ఏమీలేకుండా కూర్చోడం, నా కుతూహలాన్ని ఎక్కువచేసింది.

ఎవరండి ఆయన' అన్నాను, చేతిలోని పత్రిక ముఖానికి అడ్డంపెట్టుకొని, పొన్నకాయితో ...పొన్నకాయి నన్ను ఎగాదిగా వింత మృగాన్ని చూసినట్టుచూసి, ఎదురుగుండాఉన్న పెద్ద మనిషికి వినపడాలని కాబోలు గట్టిగా 'వారా! తెలియదూ? ఆయన్ని ఎఱుగనివారు ఇంకాఉన్నారూ? అందుకే ఆంధ్రదేశం ఇలా ఉంది' అన్నాడు...

నేను వెఱ్ఱి మొహంవేసి 'క్షమించాలి నా అజ్ఞానాన్ని' అన్నట్టుగా పొన్నకాయి కళ్ళల్లోకి చూశాను. పొన్నకాయికి తృప్తి కలిగింది. ఉపోద్ఘాతప్రాయంగా గొంతుక సవరించుకొని, ఓపట్టు పొడుంపీల్చి (ఈమాటు పొన్నకాయి పొడుండబ్బా మూత తీస్తూంటేనే, నేను కళ్లు మూసుకొని, అతడు చేతులు దులుపుకొన్న శబ్దం విన్నాక కళ్లు తెరిచాను) ప్రారంభించినాడు. 'ఆయన రామస్వామి గుప్తాగారు. వారు చేసిన దానాలకు లెక్కలేదు. సంగీత సాహిత్యాల్ని పోషిస్తున్నారు. ఎన్ని ధర్మకార్యాలు చేశారో చెప్పలేం' అంటూ చెప్పడం మొదలుపెట్టినాడు ...నేను చేసేదేమీలేక చెవు లప్పగించాను... పెద్దమనిషి 'బాగుంది' అన్నట్టు చిఱునవ్వు నవ్వనాడు...ఇంక పొన్నకాయిని పట్టపగ్గాలు లేకపోయాయి...'వారు సంగీతం అంటే చెవి కోసుకొంటారు ... సాహిత్యం అంటే నిద్రాహారాలు మానేస్తారు'...పొన్నకాయి ఉపన్యాసం స్థాయి ఎక్కువైంది...రైల్లో కూర్చున్నవాళ్ళంతా మా ఇద్దరివైపూ సాక్షిప్రాయంగా చూడ్డం మొదలుపెట్టినారు ... ఈవిధంగా పదిమంది చూపులకి కేంద్రంయినానేఅనే సిగ్గుతో నాకు సగం చచ్చినట్లయింది—పొన్నకాయికి ఈ దృష్టే లేదు... నయాగరా జలపాతంలా మాట్లాడుతున్నాడు...

'వారికేమండీ! లక్ష్మీపుత్రులు. ఏనాడో పెట్టిపుట్టారు. యుద్ధకాలంలో రోజుకి ఐదువేలు లాభం తీశారు. చేతకావద్దుటండీ వ్యాపారం! కభుర్లుచెప్తే సరా!' అని పూర్తి చేశాడు. ఇంకా ఏదో మాట్లాడబోతూండగా రైలు కూత, ఆ కూతల్ని తనలో ముంచేసుకొంది...నాకు రిటైరు అయ్యాటప్పటికి 'ప్రావిడెంటు ఫండు' ఐదువేలైనా వస్తుందా అని ఆలోచిస్తూ పరధ్యానంగా ఉన్నాను నేను.

పొన్నకాయి ఇది కనిపెట్టి, నన్నుతట్టి 'ఇప్పుడు శ్రీవారు సభలకు మద్రాసు పోతున్నారు. మనం ఎప్పుడూ వారివెంటే ఉంటూంటాం' అన్నాడు. ఇంకా ఏదో చెప్పబోతూంటే, బిచ్చగాడి 'బాబూ కుంటోణ్ణి' అనే కేక, ఆ వాక్ప్రవాహానికి ఆనకట్టు కట్టింది.

పొన్నకాయి విసుగుకొన్నాడు. గుప్తగారు తనపక్కని నుంచొని బిచ్చగాడు కేకవేస్తున్నా, తన్నుకాదన్నట్టు-భక్తులు మొఱపెట్టుకొంటూంటే నిశ్చలంగాఉండే రాతిదేవునిలా-కూర్చున్నాడు.

'కుంటోణ్ణి, బాబూ' అంటూ బిచ్చగాడు మా మధ్యకి కుంటుకొంటూ వచ్చి అడుగుకోడం మొదలుపెట్టినాడు.

'ఒరేయ్, నీకెక్కడూ చెప్పేది? వారిమీద అలా పడవద్దని. కళ్లులేవూ' అని గర్జించినాడు పొన్నకాయి.

'పెబువుల్ని అడుక్కోనీండి బాబయ్యా! ఆరు ధర్మపెబువులని తమరేగందా సెలవిచ్చేరు' అన్నాడు ధీమాగా వాడు...

...వాడి 'ఆర్గ్యుమెంటు' నాకు నచ్చి, 'పోనీ అడగనీండి, వారికి దయపుట్టి ఏదేనా యివ్వొచ్చు' అన్నాను.

'అద్బే దానిక్కాదు. శ్రీవారు తమ దగ్గర డబ్బు వుంచుకోరు. అంతా భృత్యులం, మేం చూస్తూంటాము. వారి కేం కావాలి మేంవుండగా; మహారాజులు' అని బిచ్చగాడి వైపు చూశాడు, 'మహారాజులు' అన్నది వాడు విన్నాడేమో అన్నట్టు...గుప్తాగారు ఇదంతా వింటూ, చూస్తూ, నిశ్చలంగా కూర్చున్నారు. వారి ఆసన శుద్ధి నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది...

బిచ్చగాడు ఇల్లాంటి వాటిలో బాగా రగడ దేరిన చెయ్యి. వా డన్నాడు 'అయితే తమరే ఇప్పించండి బాబూ' అని......నేను ఓ కానీ ఇచ్చాను......వాడు 'మా బాబు, మా బాబు' అంటూతీసుకొని, పొన్నకాయికేసి తిరిగి 'తమరో బాబూ' అన్నాడు...పొన్నకాయి కోపంతో 'ఒరేయ్, నీక్కాదూ చెప్పేది?' అని, నా వైపు చూసి 'ఇచ్చారుగా ఆయన, మేమంతా ఒకటే' అన్నాడు...ఈ 'కలుపుకోడం' నాకు వెగటుగా వుంది. కాని ; సంప్రదాయ సిద్ధంగా మనలోవున్న, ధనవంతుల్ని గౌరవించడం, వారితో సంబంధం వున్నదనుకొని సంతోషించడం ; నన్ను నోటమాట రాకుండా చేశాయి...బిక్కమొగం వేసుకొని బిచ్చగాని వైపు చూశాను...వాడునా అసహాయత అర్థం చేసుకొన్నట్లుగా, 'పోనీలెండి బాబయ్యా, పోనీ బాబూ' అంటూ ముందుకి జరిగిపోయాడు...

...నాలో నేను తర్కవితర్కాలు చేసుకొంటూ కూర్చున్నాను. నా చేతకానితనం నాకర్థమయినా, ముష్టివెధవకి ఇంత తలబిరుసా అని అనుకొంటూ తృప్తిపడబోయాను...మన తప్పు మనకి మనమే అంగీకరించుకోడం ఎంతకష్టం... అదేదో చిన్న స్టేషను వచ్చింది. అక్కడ మా రైలు ఆగదు. కాని సిగ్నల్ ఇవ్వలేదుకాబోలు, ఆగింది...నేను కిటికీలోంచి కిందకి చూశాను... ప్యాసింజరుకోసం కనిపెట్టుకొనివున్న ప్రజలంతా, మావైపూ, రైలువైపూ వింతగా చూస్తూ లేచి నుంచున్నారు ... కొందరు గబగబా రైలెక్కబోయినప్పుడు, 'ఇది కాదు, ఇదికాదు- ఇది పరుపుల పెట్టె, డబ్బెక్కువ వసూలుచేస్తారు' అని పెద్ద మనిషిచెప్పి వాళ్ళని దింపేశాడు... పొన్నకాయి తన మహారాజపోషకుని తెలివికి అభినందిస్తూ చిరునవ్వు నవ్వినాడు...గుప్తాగారు ఆనందంతో కళ్లు పెద్దవిచేసి పళ్ళికిలించి తన్ను తాను అభినందించుకొన్నారు...ఇదంతా నేనుఓకంట కనిపెడుతూనే వున్నాను...

...ఇంతలో గార్డు పచ్చజెండా వూపినాడు. ... రైలు కూసి, ముందుకి వెళ్ళడానికి ఉపోద్ఘాతంగా వెనక్కి నడిచింది కొంచెం. మే మందరం అప్రయత్నంగా నవ్వుకొన్నాం. ఇంతలో మా పెట్టె తలుపు దభాలున తోసుకొని ; ఓచిన్నపిల్లని ఓ చేత్తోను, ఇంకో పిల్లనో, పిల్లాణ్ణో చంకని పెట్టుకొని ఓముష్టిది రైలెక్కింది. ఈ అనుకోని సంఘటనానికి గుప్తాగారు ఆశ్చర్యచకితులై, తమ బరువుని ఇటూ అటూ ఓసారి సర్దుకొని కూర్చున్నారు...పొన్నకాయి 'ఈ వెధవ రైలు ప్రయాణం ఇంతే' 'అని కసురుకొని రైలు పెట్టెలో వ్రాసి ఉన్న 'దొంగలున్నారు జాగ్రత్త' అనే దాన్ని తనకు వచ్చిన అన్ని భాషల్లోనూ చదువుతూన్నట్లు పైకిచూస్తూ కూర్చున్నాడు... మేమందరం ఈ ముష్టిది రావడం ఇష్టం లేక, చిరాగ్గా కూర్చున్నాం.

...కుంటివాడు మాత్రం కొంచెం తప్పుకొని ఆమెకు చోటిచ్చి, పెద్ద పిల్లని తన దగ్గర నుంచోబెట్టుకొన్నాడు.......అతను ఈ సంఘటనాన్ని ఇంతగా అర్థం చేసుకొని, తగినట్టుగా ప్రవర్తించడం నాకూ సిగ్గునీ, ఆశ్చర్యాన్నీ కలిగించింది... ...మేమందరం వాళ్ళకి సంబంధించిన వాళ్లం కానట్టూ, వాళ్లు వేరన్నట్టూ—దూరంగా నుంచున్నారు. నాకు తల తిరిగింది.

అకస్మాత్తుగా, మేం ఉలిక్కిపడేటట్టు, తల్లీపిల్లా పాట అందుకొన్నారు. ఆకంఠధ్వని మమ్మల్ని, మా ఇష్టాగోష్ఠులు మానిపించి, తనవెంట తిప్పుకొంది... అప్రయత్నంగా మేం ఆమెవైపు చూశాము... ఆమెకు మాకు ప్రతిగా చూడ్డానికి, కళ్లులేవని తెలిసింది. నేను ఉలిక్కిపడ్డాను.

రామస్వామిగుప్తాగారు ఆశ్చర్యంగా చూస్తూ, పొన్నకాయివైపు తిరిగి 'ఔర, కళ్ళు లేకపోయినా ఎలా ఎక్కిందో రైలు' అన్నాడు. ఆమె స్థితి విషయమై ఆ మహారాజపోషకునికి అదొకటే హృదయానికి తట్టినందుకు నాలో కలిగిన భావాన్ని 'ఇది' అని చెప్పలేను. ఈ ఇద్దరిలో ఎవరు గుడ్డివారో అని కొంచెంసేపయాక అనుకొన్నాను.

'వాళ్ళ కది అలవాటే. అయినా అది నిజంగా గుడ్డిదే అంటారా' అన్నాడు పొన్నకాయి, తన తెలివికి తానే నవ్వుకొంటూ...పెద్దమనిషి విరగబడి నవ్వడం మొదలు పెట్టాడు. ఈనవ్వు విని ముష్టిది, తన రూపాన్ని చూసి నవ్వుకొంటున్నారేమో అనుకొని సిగ్గుపడి...పాపం...తన చిరిగిన పైటను సర్దుకొంది... నేను కళ్ళుమూసుకొన్నాను. నా బలహీనత నాకు అర్థమయింది. నా

న్యాయం అని తోచినదాన్ని నిర్భయంగా చెప్పడానికి చాలిన శక్తేదీ నాలో!

'పాడమ్మా, పాడు' అని ధైర్యం ఇచ్చినాడు బిచ్చగాడు. ఆమె పాడ్డం మొదలుపెట్టింది... అమర గానం... మే మందఱం మంత్ర ముగ్ధులమైనట్లువింటున్నాం... పొన్నకాయికూడా, మొదట్లో నిశ్చలంగావున్నా, చివరికి పాటకే లొంగిపోయినట్లు తోచింది. సంగీతసాహిత్యాలకు మహారాజపోషకుడైన పెద్దమనిషి మాత్రం, తల కిటికీలోంచి పైకిపెట్టి, రైలు పక్కనేపోతూవున్న 'టెలిగ్రాఫ్' స్తంభాల్ని లెక్కపెడుతున్నాడు. తాను మమ్మల్ని ఆకర్షించలేకపోవడం, ఓ ముష్టిది మమ్మల్ని ఆకర్షించడం ఆయనకు కోపకారణం అయిందేమో!

కుంటివాడు మాత్రం కళ్లుమూసుకొని పాటను వింటున్నాడు. రసానందాన్ని అనుభవిస్తూన్న మహారసికుని ముఖంలోని శాంతం అతని ముఖంమీద చిందులాడుతోంది. తన్మయావస్థలో ఉన్నాడు.

ఆమె పాట ఆపింది... చిన్నదాని చెయ్యి సహాయంతో డబ్బులు అడుక్కోడం మొదలుపెట్టింది. అందరి చేతులూ అప్రయత్నంగా జేబుల్లోకి వెళ్ళినవి.

పెద్ద మనిషి మాత్రం నిశ్చలంగా కూర్చున్నాడు. ముష్టిది దగ్గరికివచ్చినప్పుడు, ఆమె మాసిపోయిన చీర తనకి ఎక్కడ తగులుతుందో అని ముడుచుకొని కూర్చున్నాడు.

'అక్కడే ఏడవకూడదూ? ఇచ్చేవాళ్లెవరేనా వుంటే, వాళ్లే పారేస్తారు' అన్నాడు పొన్నకాయి మహారాజపోషకుల చేష్టలనుబట్టి వారి భావాన్ని గ్రహించి...

నేను అర్ధణా ఇచ్చినాను... ఇంకా ఎవరెవరో ఇచ్చినారు... ఆమె తన యథాస్థానానికి వెళ్ళి కూర్చుంది, చంకనున్న పిల్లాణ్ణి ఒళ్లో వేసుకొని ... నేను ఆ బీదవాళ్ళవైపూ, వాళ్ల పనులవైపూ చూస్తూ కూర్చున్నాను. పొన్నకాయి గొంతుక సవరించుకోడం విని ఆవైపు చూశాను... అతని దృష్టి గుప్తాగారి ఉంగరాలమీద వుంది...

ఇంతలో ఏదో స్టేషను సమీపించిందికాబోలు బండికి బ్రేకులువేశారు... ముష్టిది లేచి నుంచుని, ఆఖరిసారిగా 'ధర్మతండ్రులు బాబూ, ఓ కానీ' అంది... ఎవళ్లగొడవలో వాళ్లుండి ఆమెమాట వినిపించుకోలేదు... నేనుమాత్రం అటు చూసేసరికి, కుంటివాడు ఆమెచేతిలో ఏదో పెట్టడం కనబడింది... ఆమె ఎవరో ప్రయాణీకుడనుకొని 'నా తండ్రి, నా తండ్రి! ఇస్తారో, పెట్టిపుడతారో!' అంది... ఆక్షణంలో కుంటివాడి ముఖంలో కనుపట్టిన ఆనందం నాజన్మలో నేనెవరిముఖంలోనూ చూడలేదు... ఇవ్వడంలో వున్న ఆనందం, అందులో కళాస్వాదనచేసి ప్రతిఫలంగా ఇవ్వడంలోని ఆనందం, వాడు నాడే గ్రహించినట్లు తోచింది. ముష్టిదాని కూతురుమాత్రం-కళ్ళున్నాయి గనుక-కుంటివాడు మనకి ఇవ్వడమేమిటా అన్నట్లు నమ్మలేకుండా చూస్తూ వుండిపోయింది.

ఇంతలో రైలాగింది. 'రా అమ్మా, రా, ఇంకో పెట్టెలోకి పోదాం' అంటూ కుంటివాడు ముందు తాను దిగి, కఱ్ఱమీద ఆనుకొని, పిల్లని దింపి, ఆమె దిగడానికి సాయంచేశాడు.

వాళ్ళు దిగినవెంటనే, ఇంకో పెద్దమనిషి ఎవరో రైల్లోకి రావడం, పొన్నకాయి ఆయన్ని ఆనవాలుపట్టి, గుప్తాగారిని చూపిస్తూ 'తెలియదండీ వారు? రామస్వామి గుప్తాగారు... సంగీత సాహిత్య మహారాజపోషకులు...' నేనింక వినిపించుకోలేదు. నా సంచి చేత్తో పుచ్చుకొని ఆ పెట్టెలోనుండి దిగి, ముష్టిది, కుంటివాడు ఎక్కిన పెట్టెలోనికి నా మహారాజపోషకుణ్ణి చూడ్డానికి ఎక్కినాను... రైలు కదిలింది.

గోపురము ప్రక్కను చిత్రింపఁబడిన క్రోఁతి గోపురమును దాను మోయుచున్నాననియు దాను లేనియెడల గోపురము కూలిపోవుననియు ననుకొనుట యెట్టిదో—మోటారుబండి చక్రపుటాకుపై నున్న యీఁగ నామూలమున బండి యెంత వేగముగాఁ బోవుచున్నదో యని యనుకొనుట యెట్టిదో—ప్రపంచ శాసనముల కన్నింటికి బానిసయై పుట్టిన మనుజుఁడు ప్రపంచమునకు నావలన మేలు జరుగుచున్నదని యనుకొనుటయట్టిదె.—పానుగంటి.